# కాల! ఇదేమి చిత్రం!

సిగరెట్ ప్యాకెట్ మీద "...స్మోకింగ్ ఈజ్ ఇంజూరి యస్ టు హెల్త్" అనే చట్టబద్ధమైన హెచ్చరికను చదివి, అందులో మిగిలిన రెండు సిగరెట్లనూ తీసుకొని, సిగరెట్ ప్యాకెట్‌ని దూరంగా విసిరేసాడు సుబ్బారావు. ఒకటి చొక్కాకు ఎడమవైపు ఉన్న జేబులో వేసుకుని మరొకటి వెలిగించి, గట్టిగా ఒకదమ్ములాగి, తృప్తిగా రింగులు రింగులుగా పొగ గాలిలోకి వదిలాడు.



బస్టాపులో ఉన్న కొందరు ప్రయాణీకులు అతడివైపు నోళ్ళు వెళ్ళబెట్టుకొని చిత్రంగా చూస్తున్నారు. రెండువేళ్ళ మధ్య సిగరెట్ పెట్టుకొని అతడు త్రాగుతున్న స్టైల్ చూసి కొంతమంది పరవశించిపోతున్నారు. మరి కొందరు నాకంటే చాలా బాగా త్రాగుతున్నాడని ఈర్ష్య పడుతున్నారు. కొందరమ్మాయిలయితే 'ఖుషి' సినిమాలో పవన్ కళ్యాణ్‌లా త్రాగుతున్నాడని గుసగుసలాడుకుంటున్నారు. మరికొందరు అమ్మాయిలు అతనికేసి చిరాగ్గా చూస్తూ, అసహ్యంగా తలలు తిప్పుకుంటున్నారు. వీరందర్నీ చూస్తూ సుబ్బారావు తననో హీరోగా ఐడెంటిఫై చేసుకుని, గర్వంగా ఫీలవుతున్నాడు. సిగరెట్ స్టైల్‌గా కాల్చడం తనకు దేవుడిచ్చిన వరమని, అది అందరికీ సాధ్యం కాదనీ మనసులో తెగ మురిసిపోతున్నాడు.

సుబ్బారావు ఏదో ఆఫీసులో క్లర్క్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తన ఇంటికి, ఆఫీసుకీ చాలా దూరం. బస్ కోసం వెయిట్ చేస్తూ సిగరెట్ త్రాగడం అతడి అలవాటు. కాదు... కాదు... వ్యసనం!

అంతలోపే బస్సు రావడంతో ఆఖరి దమ్ము గట్టిగా పీల్చి అవతల పారేసి, పొగను గాల్లోకి వదులుతూనే క్యారియర్‌ని మరో చేతిలోకి మార్చుకుని, బస్సులోకి ఎక్కి సీటు దొరక బుచ్చుకుని కూర్చున్నాడు.

ప్రయాణీకులందరూ ఎక్కిన తర్వాత బస్సు కదిలింది. ఎటువంటి అసౌకర్యమూ ఇబ్బందీ లేకుండా సీట్లో కూర్చున్న తర్వాత క్యారియర్‌ని సీటు కింద కాళ్ల దగ్గర పెట్టుకుని, ఇంతకు ముందు త్రాగిన సిగరెట్ చాల్లేదని, అంతలోనే నోరు లాగుతోందని, సిగరెట్ రుచి కోసం నాలుక అర్రులు చాస్తోందని... ఉన్న ఒక దానినీ జేబులోంచి బయటకు తీసి గుప్పిట మధ్య వెలిగించుకున్నాడు.

అతడు పొగను గుప్పుగుప్పున నోటితో ఊదుతూ ఉంటే అది గాలిలో వ్యాపించి, చుట్టు ప్రక్కల కూర్చున్న, నిలబడిన ప్రయాణీకుల ముక్కుపుటాలను తాకుతూంటే అసహ్యంగా, ఇబ్బందిగా కదులుతున్నారు. సుబ్బారావు మాత్రం ఇదేమీ పట్టించుకోవడం లేదు.

కొంతమంది యువకులు అతడి ధూమపానాన్ని భరించలేక "ఆపేయండి" అని చెప్పాలనుకున్నారు. అయితే కోపంగా గుడ్లురిమి చూస్తాడేమోనని భయపడి మిన్నకుండి పోయారు.

బస్సులోని ప్రయాణీకులందరికీ సుబ్బారావు కేంద్ర బిందువయ్యాడు. అందరూ అతడి వైపు రకరకాల ముఖకవళికలతో చూస్తున్నారు.

కొన్ని నిమిషాల తర్వాత ముందు సీట్లో కూర్చున్న యువకుడు సుబ్బారావు వైపు తిరిగి రిక్వెస్ట్‌గా అడిగాడు. "ఏమండీ! నాకు చాలా అనీజీగా ఉంది. సిగరెట్ కాల్చడం ఆపేస్తారా?"

"అదే కుదరదండీ! కాల్చకపోతే నేను ఉండలేను" ఖచ్చితంగా త్రాగాల్సిందే అన్నట్టు ఫేస్ పెట్టి అని, మరో దమ్ము లాగాడు.

"చూడడానికి చదువుకున్న వ్యక్తిలా అగుపిస్తున్నారు. నా బాధ అర్ధం చేసుకోండి!"

"మిగతా వారికి లేని బాధ నీకొక్కడికేనా?" దీర్ఘంతీస్తూ అన్నాడు.

"వారు మొహమాటంతో అడగలేకపోతున్నారు" సౌమ్యంగా అన్నాడు యువకుడు.

"అందరూ అడిగితేనే ఆర్పివేస్తా!" సీరియస్

**టి.వి. నాగేంద్ర ప్రసాద్**
**మొదటి కథ**

గా చూస్తూ అన్నాడు సుబ్బారావు.

ఆ యువకుడికి ఒళ్లు మండింది. ఇలాగైతే మాట వినేట్టులేడని మణికట్టు దగ్గరున్న చొక్కా కఫ్స్‌ని మోచేతుల దగ్గరికి లాగుతూ దాదాపు కొడుతున్నవాడిలా అన్నాడు.

"నీకే మాత్రమైనా కామన్‌సెన్స్ ఉందా? ఇతరుల ఇబ్బందిని అర్థం చేసుకోకుండా సినిమాలో విలన్‌లా దట్టంగా పొగ వదులుతున్నావ్! ఆర్పేయ్!"

అతడి సీరియస్‌నెస్‌ను చూసి నిజంగానే కొడతాడని సుబ్బారావుకి భయమేసింది. మనసులోని మేకపోతు గాంభీర్యం నీరుగారి పోయింది. ఏమీ అనలేకపోయాడు.

చుట్టూ ఉన్న ప్రయాణీకులు "భలే కోటింగ్ ఇచ్చాడు" అని గుసగుసలాడుకోవడం విన్న సుబ్బారావు ఇంకా ఊరుకుంటే తన అహం దెబ్బ తింటుందని –

"ఏం! ఆ మాత్రం స్వేచ్ఛలేదా?"

"స్వేచ్ఛ వుంది. కానీ ఇతరులను కష్టపెట్టేది స్వేచ్ఛ అన్పించుకోదు" అన్నాడు యువకుడు.

"నేనెవరిని కష్టపెట్టాను?"

"ఒక్కసారి నీ చుట్టూ చూడు!"

సుబ్బారావు బస్సులో నాలుగువైపులా పరకాయించి చూసాడు.

పక్కసీటులో కూర్చున్న వ్యక్తి అతణ్ణి చీదరించుకుంటూ దూరంగా జరగటానికి ప్రయత్నిస్తున్నాడు. కొందరు ముక్కులకు జేబురుమాలు పెట్టుకున్నారు. మరికొందరు పొగను చేతుల్తో తోలటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.

"నేనొక్కడినేనా? చాలామంది ధూమపానం చేస్తారు కదా?"

"ఇక్కడ కాదు... బయట!" వెటకారంగా అన్నాడు యువకుడు.

చుట్టూ ఉన్నవాళ్లు గొల్లున నవ్వారు. సుబ్బారావుకి తల కొట్టేసినట్టయింది. ఎవరయినా కాలుస్తున్నారేమోనని పైకి లేచి చూసాడు. బ్యాడ్‌లక్! ఎవరూ సిగరెట్ కాల్చడం లేదు. అందరూ తనవైపే చూస్తోంటే గిల్టీగా ఫీలవుతున్నాడు. ఏం చేయాలో పాలుపోక యువకుణ్ణి మంచి చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు చిరునవ్వుతో అడిగాడు. "సిగరెట్ పొగ పీలిస్తే ఏం నష్టం జరుగుతుంది?"

"నికోటిన్ విషప్రభావానికి లోనై క్షయ, కాన్సర్ లాంటి దీర్ఘకాల వ్యాధుల్తో బాధపడతారు" చిన్న పిల్లాడికి చెప్పినట్టు చెప్పాడు.

"ఆ విషయం నాకు తెలుసులే!" ఆ పాయింట్‌ని తోసేస్తున్నట్టు అన్నాడు.

"మరెందుకు అడిగావు?"

నీకు తెలుసో లేదోనని! అయినా సిగరెట్ తాగనివాడు దున్నపోతై పుడతాడట" కంఠంలో హేళన ధ్వనించేలా అన్నాడు సుబ్బారావు.


"తాగేవాడు బురదగుంటలో పందై పుడతాడట" అంతకన్నా హేళన ధ్వనించేలా అదే స్పీడ్‌లో యువకుడు సమాధానమిచ్చేసరికి మరొకసారి చుట్టుపక్కల పకపకలు వెల్లి విరిసాయి.

సుబ్బారావుకి తలకొట్టేసినంత పనైంది. కూర్చున్నది మెత్తని సీటే అయినా ముళ్ళ సీటులా అన్పించింది ఆ క్షణాన.

"చూడబ్బాయ్! కాస్త మర్యాదగా మాట్లాడు!" సీరియస్‌గా అనబోయాడు.

అయ్యో! నేనింతవరకూ అలానే మాట్లాడుతున్నానే! మీకలా అన్పించలేదా" చాలా వినయంగా చెప్పాడు యువకుడు.

"బురదగుంటలో పందేమిటి? అలా మా




ట్లాడటం అమర్యాదా? కాదా?"

"అయ్యో! అది అమర్యాదని పెద్దలు నాకు చెప్పలేదులెండి" ఎగతాళిగా అన్నాడు.

యువకుడు వేస్తున్న జోకులకి చుట్టూ ఉన్న ప్రయాణీకులు ముసిముసిగా, శబ్దం చేసుకుంటూ నవ్వుకుంటున్నారు. స్త్రీలయితే మరింత సంతోషిస్తూ "వాడికి అలా తగిన శాస్తి జరగాల్సిందే"నని మనసులో అనుకుంటున్నారు.

పెద్దగుండ్రాయి సుబ్బారావు మెడ మీద పెట్టినట్టయింది. అవమానాన్ని భరించలేక సిగరెట్‌ని కిటికీలోంచి బయటకు విసిరేసాడు. తనలో తను ఉడుక్కుంటూ – కక్కాలేక మింగాలేక అన్నట్టు తలను వేలాడేసి కూర్చున్నాడు.

"సార్!" వినమ్రంగా పిలిచాడు యువకుడు.

గౌరవంగా అతడు పిలిచేసరికి సుబ్బారావు తలెత్తి "ఏం?" అన్నట్టు కనుబొమ్మలు ఎగురవేసాడు.

"సైటుందా మీకు?"

ఇతడికి ఎందుకొచ్చిందీ అనుమానం అని మనసులో అనుకొంటూ "లేదు" అన్నాడు సుబ్బారావు.

"లేదా!" అని "అయితే అటు చూడండి" అంటూ చూపుడు వేలుని బస్సు సీలింగ్ వైపు చూపించారు.

అక్కడ ఎర్రరంగుతో వ్రాసిన అక్షరాలు కనపడ్డాయి.

అవమానం! ఘోర అవమానం! ఎప్పుడూ, ఎక్కడా, ఎవరితోనూ ఎదుర్కోని, చూడని, చవిచూడని అవమానం!! బస్సులో ఉన్న అందర్నీ ఒక్కసారిగా బాంబ్‌తో బ్లాస్ట్ చేయాలన్నంత కోపం సుబ్బారావులో తన్నుకొచ్చింది.

అంతలోనే తను దిగవలసిన స్టేజి రావడంతో దిగిపోయాడు ఆ యువకుడు.

తరువాత కొన్ని నిమిషాలకు సుబ్బారావు కూడా బస్సు దిగి ఆఫీసుకి చేరుకున్నాడు.

సుబ్బారావు ముఖం చింత బరికెతో కొట్టి

నట్టు ఎర్రగా కందిపోయింది. విపరీతమయిన దుఃఖాన్ని కడుపులోనే అదుముకుని విషాదంతో ఆఫీస్‌లోకి ప్రవేశించాడు. ఎప్పుడూ నవ్వుతూ కనబడే సుబ్బారావు అలా కన్పించేసరికి కొలీగ్స్ ఆశ్చర్యపోయారు.

"ఏమిటీ, డల్‌గా ఉన్నావు?" ఒక సహోద్యోగి అడిగాడు.

"ఎనీ ప్రాబ్లమ్?" మరొకతను అడిగాడు.

"చెప్పు సుబ్రావ్! వీలయితే హెల్ప్ చేస్తాం!" ఇంకొకరు అడిగారు.

వాళ్లంతా అలా ఆప్యాయంగా అడుగుతూ ఉంటే ఏడుపు తన్నుకొచ్చింది. తనకు జరిగిన అవమానాన్ని చిన్న పిల్లాడిలా వెక్కివెక్కి ఏడుస్తూ పూసగుచ్చినట్టు చెప్పాడు. కొలీగ్స్ అందరూ అతడి కళ్ళ వెంబడి జలజలా రాలుతున్న కన్నీళ్ళను కర్చీఫ్‌లతో తుడుస్తూ ఓదార్చారు.

ఇంతకు మునుపు సుబ్బారావును ఎవరైనా "నీవు సిగరెట్ అంత స్టైల్‌గా కాల్చడం ఎలా నేర్చుకున్నావు? మొదట నీకు సిగరెట్ అలవాటు ఎలా అయింది?" అని అడిగితే అందుకు సమాధానంగా పగలంతా ఆఫీసులో పనిచేయకుండా నిద్రపోయిన నాకు రాత్రి పవళించే సమయానికి నిద్ర రాదు. ఆ సమయంలో నాకు బోర్ కొడ్తుండేది. సరిగ్గా అప్పుడే సిగరెట్ కాల్చాలనే మెరుపులాంటి ఆలోచన ఫ్లాష్ అయింది.. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ దాని టేస్ట్‌ని ఆస్వాదిస్తున్నాను, ప్రేమిస్తున్నాను" మనసులో సంతోషిస్తూ గొప్పగా చెప్పుకునేవాడు.

ఇప్పుడు అదే ప్రశ్నని ఎవరయినా అడిగితే మండిపడతాడు. "ఆ ప్రస్తావన గురించి నా దగ్గర చర్చించొద్దు" అని విసుక్కుంటున్నాడు. అలా అని సిగరెట్ తాగడం మానేసాడా అంటే అదేంలేదు. కంటిన్యూ చేస్తూనే ఉన్నాడు.

★ ★ ★

సుబ్బారావు ఒకరోజు తన పై ఆఫీసర్‌ని తన ఇంటికి డిన్నర్‌కి ఆహ్వానించాడు. అలా చేయడం వలన ఆఫీసర్ దృష్టిలో మంచివాడుగా ముద్ర పడి (ఆఫీసులో పని చేయకుండా నిద్రపోయినా) ప్రమోషన్ కొట్టొచ్చనేది అతని మనసులోని ఆలోచన.


ఇంటి వరండాలో అటూ ఇటూ తిరుగుతూ ఆఫీసర్ కోసం ఎదురు చూస్తున్నాడు సుబ్బారావు. అప్పుడే ఒక కారు వేగంగా వచ్చి సడెన్ బ్రేక్‌తో అతడి ఇంటి ముందు ఆగింది. కారు డోరు తెరుచుకుని అందులోంచి ఆఫీసర్ నెమ్మదిగా దిగాడు. నలభై ఏళ్ళు ఉంటాయి అతనికి.

లేని నవ్వుని మూతికి పులుముకుని అతణ్ణి సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించాడు సుబ్బారావు. హాలు మధ్యలో ఉన్న సోఫా దగ్గరకు తీసుకుపోయి అందులో కూర్చోబెట్టి తనూ కూర్చున్నాడు - అతడికి ఎదురుగా ఉన్న మరో సోఫాలో.

తర్వాత ఇద్దరూ లోకాభిరామాయణంలో పడ్డారు. సుబ్బారావు మధ్యమధ్యలో ఉత్సాహంగా జోకులు వేస్తూంటే ఆఫీసర్‌గారు సంతోషంగా పగలబడి నవ్వుతున్నారు.

సుబ్బారావు భార్య వంటకాలను డైనింగ్ టేబుల్ మీద సిద్ధం చేస్తోంది. అతడికి వెనుక వైపున కొద్ది దూరంలో ఫైబర్ ఛైర్‌లో కూర్చున్నాడు అతడి ఎనిమిదేళ్ళ కుమారుడు.

విరగబడి నవ్వుతున్న ఆఫీసర్ హఠాత్తుగా నవ్వు ఆపేసి, ఆశ్చర్యంగా కళ్ళప్పగించి అలాగే చూస్తుండిపోయాడు.




ఈ హఠాత్ పరిణామానికి "ఏమైంది సార్?" అని కంగారుగా అడిగాడు సుబ్బారావు.

"నీ వెనక్కు చూడు" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అప్రయత్నంగా అన్నాడు.

సుబ్బారావు తిరిగి చూసాడు. ఒక్కసారిగా షాక్‌కి గురయ్యాడు.

దూరంగా అతడి ఎనిమిదేళ్ళ కొడుకు కాళ్ళు రెండూ కుర్చీలో పెట్టుకొని, ముట్టించిన సిగరెట్‌ను వేళ్ళ మధ్య పట్టుకుని, బలంగా పీలుస్తూ, పొగను గాలిలోకి "ఉఫ్... ఉఫ్" అంటూ ఊదుతున్నాడు. ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కినంత అనుభూతి ఆ పిల్లాడి కళ్ళల్లో తొణికిసలాడుతోంది. మనసంతా థ్రిల్లింగ్‌గా ఉండటం వల్లనేమో ఆ పిల్లాడి ముఖంలో ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

తను చూస్తున్నది కలా, నిజమా అన్నట్టు ఒకసారి కళ్ళునులుముకొని చూసాడు సుబ్బారావు. నిజమేనని గ్రహించాడు. అంతే! ఒక్కసారిగా ముఖకవళికలు చకచకా మారి పోయాయి. భృకుటి ముడిపడింది. ముక్కు పుటాలు అదురుతున్నాయి. ముఖం రౌద్ర రూపం దాల్చింది. ఒక్క అంగలో ఆ కుర్రాడి దగ్గరకు చేరి చెంప ఛెళ్ళుమనిపించాడు.

పిల్లాడు కుర్చీలోంచి గభాలున క్రింద పడ్డాడు. చేతిలోని సిగరెట్ దూరంగా ఎగిరి పడింది.

కొడుకుని కొట్టకుండా వారించడానికి "ఏమండీ!" అంటూ పరుగుపరుగున వచ్చింది అతని భార్య.

"సుబ్రావ్ కొట్టొద్దు" అంటూ ఆఫీసర్ కూడా లేచి వచ్చాడు.

మళ్ళీ కొట్టాలని ప్రయత్నిస్తున్న తండ్రి నుంచి చురుకుగా తప్పించుకుంటూ, తృప్తిగా సిగరెట్ తాగుతున్న తనని డిస్టర్బ్ చేసినందుకు "ఎందుకు కొడుతున్నావ్?" అని కోపంగా ప్రశ్నించాడు.

"నోరెత్తావంటే ఒళ్ళు చీరేస్తాను" అంటూ ఆవేశంగా చేయెత్తబోయిన సుబ్బారావుని భార్య అడ్డుకుంది.

"నేనేం తప్పు చేసాను?" ధైర్యంగా అడిగాడు పిల్లాడు.

"సిగరెట్ కాల్చడం తప్పుకాదా?" గుడ్లురుముతూ అన్నాడు.

"నువ్వు కూడా కాలుస్తున్నావు కదా!"

సుబ్బారావు గతుక్కుమన్నాడు. 'దేవుడా! నన్ను రక్షించు' అని మనసులో అనుకున్నాడు. తన ధూమపాన ప్రతాపం గురించి ఆఫీసర్‌కి తెలిసిపోవడంతో గిల్టీగా ఫీలయ్యాడు. పిల్లాడి మాటలకు తేలుకుట్టిన దొంగలా గప్‌చుప్ అయిపోయాడు.

పిల్లాడు ఇంకా ఏదో ఆవేశంగా రెచ్చిపోబోతుంటే, వాడి నోరు మూసిపెట్టి లోపలికి తీసుకెళ్ళింది తల్లి.

ఆఫీసర్ ముందు అవమానం జరిగినట్టు ఫీలవుతున్న సుబ్బారావుకి మెదడంతా బ్లాంక్ అయిపోయింది. కొన్ని సెకన్ల తర్వాత తెప్పరిల్లి, మాట్లాడకుండా ఉంటే బావుండదని బాధగా అన్నాడు.

"అతి గారాబం వల్లనే వాడు ఇలా ప్రవర్తించాడు సార్!"

ఆఫీసర్ కొన్ని క్షణాలు మౌనంగా ఉండి, "తప్పు కుర్రాడిది... కాదు నీదే!" అన్నాడు.

"ఏంటి సార్! అలా అంటారు" ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును సుబ్రావ్!" అంటూ వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. అతని వెనుకే వచ్చి సుబ్బారావు కూడా కూర్చుంటూ "ఎలా సార్!?" అన్నాడు.

"నువ్వు సిగరెట్లు తాగుతావు కదా?"

"అవును"

"ఇంట్లో కూడా తాగుతావా?"

"తాగుతాను"

"మీ అబ్బాయి ముందు?"

"రోజూ నేను సిగరెట్ కాల్చేటపుడు వాడు చూస్తుంటాడు సార్!"

"అక్కడే దెబ్బతిన్నావ్!"

"అంటే!?" అర్థం కానట్టు అడిగాడు సుబ్బారావు.

"ఏమీ లేదు. నువ్వు గమనించుకోలేదు కానీ, నువ్వు స్మోక్ చేసేటప్పుడు మీ అబ్బాయి నిన్నే చూస్తుండేవాడేమో. పిల్లలపై తండ్రి ప్రభావం ఎక్కువ ఉంటుంది. మనం చేసే మంచీ, చెడుల్నే పిల్లలు కాపీ కొడుతుంటారు. నువ్వు సిగరెట్ పొగను రౌండ్లు రౌండ్లుగా వదులుతుంటావు. అది చూసిన మీ అబ్బాయికి "ఆహా! పొగని ఎంత బాగా వదుల్తున్నాడు డాడీ! నేను కూడా అలా చేస్తే ఎంత బావుంటుందో!" అని ఆలోచన వచ్చి ఉంటుంది. అందుకే ఇలా ప్రవర్తించాడు."

సుబ్బారావుకి తల తిరిగింది. తప్పు చేశాను అన్న భావన అతని ముఖంలో కదలాడింది.


"అంతేకాదు. నువ్వు ఇంకో విషయం కూడా తెలుసుకోవాలి."

"ఏమిటి?"

## తిండిబోతు దెయ్యం

'వంటింట్లో దెయ్యం ఉంది. అటు వెళ్లకు...' టింకూని హెచ్చరించి బయటికి వెళ్లింది తల్లి.

ఆమె తిరిగిరాగానే చెప్పాడు టింకూ... 'అమ్మా... షరేమో... నువ్వు అల్మరాలో దాచిన లడ్డూల్ని దెయ్యం తినేసింది'.




"మీ ఇంట్లో ముగ్గురు స్మోకర్లు వున్నారు!"

సుబ్బారావు విస్మయానికి లోనవుతూ అమాయకంగా అన్నాడు. "అమ్మతోడు! నేనొక్కణ్ణే సార్, సిగరెట్ తాగేది."

ఆఫీసర్ చిరునవ్వు నవ్వి "నువ్వు స్మోకర్ వయితే నీ భార్య, కొడుకు పాసివ్ స్మోకర్లు. అంటే మొత్తం ముగ్గురన్నమాట"

"వివరంగా చెప్పండి సార్!"

"నువ్వు పొగతాగి వదిలినప్పుడు దానిని దగ్గరలోనే ఉన్న నీ భార్య, కొడుకు పీలుస్తారు. అలా పీల్చడం వలన నీకు కలిగే విష ప్రభావం అమాయకులైన వారికి కూడా కలుగుతుంది. అప్పుడు పొగ పీల్చేవారు తాగేవాడితో సమానమవుతారు" అంటూ నిట్టూర్చాడు ఆఫీసర్.

"అయ్యో! నేనేదో నా తాత్కాలిక ఆనందం కోసం కాలుస్తున్నాననుకున్నానేగాని, ఇది నా ఆరోగ్యంతో పాటు నా భార్య, కొడుకు ఆరోగ్యాన్ని కూడా నాశనం చేస్తుందనుకోలేదు సార్! మీ వల్ల ఈ రోజు ఈ విషయం తెలుసుకున్నాను. థాంక్యూ వెరీ మచ్ సార్! ఈ సిగరెట్ మూలంగా ఆరోగ్యం పాడైపోవడమే కాదు సార్! దీనికి బానిసనై ఓ సారి బస్సులో పెద్ద అవమానం పొందాను. నలుగురి చేతా అసహ్యించుకోబడ్డాను... మా అబ్బాయి మీద ఒట్టేసి చెబుతున్నాను. ఈ రోజు నుంచి స్మోకింగ్‌కి ఫుల్‌స్టాప్ పెడుతున్నాను" జ్ఞానోదయం అయిన వాడిలా అన్నాడు సుబ్బారావు.

"నేనేదైతే ఆశించానో అది నీ నోటి నుంచి వచ్చింది. ఇప్పుడు నాకు విందు భోజనం తిన్నంత సంతోషంగా ఉంది" తనకు ఆకలి అవుతున్న విషయాన్ని పరోక్షంగా చెప్పాడు ఆఫీసర్.

"అయ్యో! ఈ గొడవలో పడి డిన్నర్ గురించే మర్చిపోయాను. ఐయాం సారీ సార్! ఇప్పటికే చాలా లేటయింది. లేవండి సార్!"

అక్కడి నుంచి ఇద్దరూ డైనింగ్ టేబుల్ వైపు నడిచారు.